# జాలి తల్లి

బలం, బలహీనత - ఈ రెండూ వేర్వేరు లక్షణాలేమీ కావు. ఒకే లక్షణం వేర్వేరు సమయాలలో, సందర్భాలలో ధరించే రెండు స్వరూపాలు. ఒండొంటిలో అంతర్నిహితంగా సాక్షాత్కరించేవి. ఎప్పుడు ఏది ప్రబలంగా ఉంటుందో చెప్పడం కష్టం. అధికంగా బలం ఉన్నవారిలో బలహీనత కూడా అధికమే. కనుకనే స్త్రీ, అందునా తల్లి స్థితి జాలిగొలుపుతుంది.

★ ★ ★

ఆసుపత్రి ఎందరో రోగులను తనలో ఇముడ్చుకుని బాధతో మూలుగుతున్నట్టు ఉంది. పైకి చూడడానికి ఎంతో అందంగానూ, హుందాగానూ ఉన్నా, లోపలికి వెళ్ళి ఒక్కొక్క వార్డూ చూస్తున్నకొద్దీ రకరకాల రోగాలతో అవస్థ పడుతున్న రోగులతో హృదయ విదారకంగా ఉంది.

ఒక పక్క ఒంటినిండా కట్లతో కదలకుండా పడి వున్నవాళ్ళూ; కాళ్ళో, చేతులో మీదకు వేలాడ గట్టివేయగా అలాగే బాధను లోలోనే దిమింగుతూ విచారంగా ఉన్నవాళ్ళూ; మరొక పక్క దగ్గుతూ, మూలుగుతూ నిద్రరాక లేస్తూ, కూర్చుంటున్నవాళ్ళూ; మోర మీదకు ఎత్తి ఈ లోకంతో ప్రమేయం లేకుండా ఏదో ఆలోచిస్తున్నవాళ్లూ; మరొక పక్క కాలిపోయిన వాళ్ళూ, వాళ్ళ దగ్గర భయంతోనూ, ఆత్రుతతోనూ కూర్చుని గడియో క్షణమో అని మీనమేషాలు లెక్కపెట్టేవాళ్ళూ; ఇంకొక పక్క గ్లూకోజు ఎక్కిస్తున్న రోగులూ; మరికొన్ని మంచాలమీద ఏం రోగమో గాని, చూడడానికి నీటుగా శుభ్రంగా ఉన్నా ఏదో పైకి కానరాని బాధతో ఏడుస్తూ అటూ ఇటూ పొర్లుతున్న రోగులూ - ఇలా ఆసుపత్రి అంతా నిండిపోయి ఉన్నారు.

అప్పుడప్పుడు నర్సులు టకటకమని చప్పుడు చేసుకుంటూ వచ్చి కొందరి టెంపరేచర్ చూసి వ్రాసుకుంటూ; అల్లరి పెడుతూ అరుస్తున్న రోగులను, వారి దగ్గర చేరి అనవసరంగా కాలక్షేపం చేస్తున్న, చూడ వచ్చినవారిని కసురుతున్నారు.

లంచ్ టైమ్ కావడంవల్లా, రోగులు అప్పుడే ఇంత పథ్యాలు తిని ఉండడంవేల ఆసుపత్రి కొంత నిద్రపోతూంది. అంత బాధలోనూ మగత మగతగా రోగులకు కళ్ళు మూతలు పడుతున్నాయి.

అందులో మెటర్నిటీ వార్డులో - కన్న తల్లులు ఉయ్యాలలలో పాపలను చూసుకుంటూ వెనకటి బాధను మరిచిపోయి, ఆనందంతో ఏదో స్మృతుల్లో ఉన్నారు.

ఎవరో తొలి చూలు ఇల్లాలు కాబోలు, తన నోముల పంటను కనబోతూ నొప్పులు పడుతున్నది. ఎంత ఓర్చుకుందామన్నా, సహించలేక పైకే కేకలు వేస్తూంది! దూరంగా ఒక నర్సు అలా చూస్తూ

నిలబడి ఉంది. దగ్గరికయినా రాలేదు. ''అయ్యో ఊరుకో'' అనయినా అనలేదు. ఆమెకు నర్సుమీద కోపం వచ్చింది. ''తోటి ఆడదికదా ? సానుభూతి అయినా లేదేం ?'' అనుకుంది. కాని ఆ నర్సుది కఠిన హృదయం కాదనీ, అయితే ఇలాటివి ఆమెకు రోజూ అలవాటే అనీ అనుకోలేదు పాపం!

ఇంతలో అకస్మాత్తుగా వార్డులో కోలాహలం బయలుదేరింది. ''అయ్యో ! అయ్యో! పాప నెత్తుకుపోతూంది !'' అని ఒక స్త్రీ కంఠం; ఆ వెంటనే, ''ఆగు ! ఆగు ! పట్టుకోండి! పట్టుకోండి!'' అని నాలుగయిదు గొంతుకలూ అరిచాయి.

ఎవరో ఒక ఏభై ఏళ్ళ స్త్రీ ఒక చంటి పిల్లను పట్టుకొని గబగబా పరుగెత్తిపోతూంది. ఆమె, చూడడానికి సంస్కారం గల స్త్రీలా వుంది. తెల్లని చీర, జాకెట్టు ఉన్నాయి. ఆమె వెనకాలే ఏడుస్తూ, పిల్లతల్లి, ఆమె తాలూకు వాళ్ళు పరుగెత్తారు,

ఆ స్త్రీ ఇంకా ప్రహరీ గేటు దగ్గరికి వెళ్ళిందో లేదో, వెనకాలే ఉన్న ఒక వ్యక్తి ఆమె చేతిలోని పిల్లను లాక్కుని ఆమెను ముందుకు తోయడం జరిగింది. ఆ తోపుతో ఆమెగేటు మీద పడిపోయింది. తలకు బలంగా గాయం తగిలి సొమ్మసిల్లిపోయింది.

పిల్ల తల్లి పిల్లను గబగబా ఒడిలోకి తీసుకొని ఏమీ జరగలేదు కదా అని చూసుకుంది. అపాయం ఏమీ జరగకపోయేసరికి అందరూ గుండెలమీద చేయి వేసుకున్నారు.

ఆ వెనకనుండే ''ఆగండి ! ఆగండి ! ఆమెనేమీ అనకండి, మీ పిల్లకేం ఫరవాలేదు'' అని కేకలు వేస్తూ నర్సులు వచ్చారు. కాని వాళ్ళు రాకముందే ఈ సంఘటన జరిగిపోయింది.

ఎక్కడో దూరంగా కొన్ని గొంతుకలు గొల్లుమన్నాయి - ఎవరి ప్రాణమో వారిని వదిలి వెళ్ళిపోయింది కాబోలు !

అప్పుడే భూమిమీద పడిన కొత్త ప్రాణం కేరుకేరుమంది.

నర్సులు వచ్చి పడిపోయినామెను లేవదీసి, ఉపచారాలు చేయడం మొదలు పెట్టారు. ఆమెను పట్టి తోసినవాళ్ళను నిందించ సాగారు.

''మీరు మనుషులేనా ? అలా తోసేస్తారా ? చూశారా, ఎంత దెబ్బ తగిలిందో'' అని అన్నది ఒక నర్సు.

ఆ మాటలకు వాళ్ళు ఆశ్చర్యపోయారు - పిల్లను ఎత్తుకుపోతుంటే ఆమెను ఏమీ అనడం మాని, అడ్డుకొని రక్షిస్తే తిరిగి ఇలా అంటున్నారేమిటి ? అని

''అదేమిటమ్మా, అలా అంటారు ? ఆమె పిల్లవాడిని ఎత్తుకుపోతూ ఉంటే అడ్డడం తప్పా ? ఇది మరీ బాగుంది ! '' అన్నారు.

ఇంతలో పడిపోయిన స్త్రీకి తెలివి వచ్చింది. ఒక నర్సు ''విజయమ్మగారూ, లెండి!'' అని ఆమెను లేవదీస్తున్నది.

అదే సమయానికి ఆ పక్క వార్డులోనుండి ఈ కబురు తెలిసి ఒక యువకుడు పరుగెత్తుతూ వచ్చాడు.

ఆయన్ను చూసి ''డాక్టర్ ! డాక్టర్ !'' అంటూ తొలిగారు నర్సులు.

ఆ యువకుడు ఆత్రుతతో వస్తూనే, ''అమ్మా! అమ్మా! ఎలా వచ్చేశావమ్మా! ఇక్కడికి? మళ్ళీ ఇలా చేశావా? వద్దని చెప్పినా వినవుకదా? అయ్యో! దెబ్బ తగిలిందే? సిస్టర్, ఫస్ట్ ఎయిడ్!'' అని అరిచాడు. అప్పటి కప్పుడే నర్సులు అదంతా సిద్ధం చేసి కట్టుకట్టారు.

డాక్టర్ ఆమెను పట్టుకొని నడిపించుకుంటూ పోయి కారులో ఎక్కించి, ఆ పక్కనే ఉన్న తన ఇంటికి తీసుకువెళ్ళిపోయాడు.

★★★

విజయ పనసపండులాంటి పిల్లాడిని కన్నది. తన కది మొదటి కాన్పే అయినా పుట్టింటివాళ్ళు తనకెవరూ లేకపోవడం చేత అత్తవారింట్లోనే పురుడు పోసుకుంది.

తనవాళ్ళు అందరూ కోరినట్లుగానే, తన భర్తకు తొలి కానుకగా అతని ప్రతిబింబాన్నే అందించింది. పెళ్ళి అయిన దగ్గరనుండీ తనకెవరూ లేకపోవడం చేత పుట్టింటికి వెళ్ళడం, ఆ ముద్దు ముచ్చట్లూ, పెట్టుపోతలూ లేకపోవడంవల్ల మొదట్లో అత్తగారూ, మామగారూ ఎత్తి పొడిచినా మనుమడు కలగానే అందరూ ఎంతో సంతోషించి అప్యాయంతో ఆదరించారు.

తన తోటికోడలూ, బావగారూ కూడా పిల్లాడిని తీసుకుని ముద్దాడారు. పది పదిహేనేళ్లయి కాపురం చేస్తున్నా పిల్లలు లేరన్న విచారంతో కాబోలు, కంట తడిపెట్టుకున్నారు.

మళ్ళీ రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి. అన్నాళ్ళ వియోగం, పూర్వ స్మృతులను జ్ఞాపకం తెస్తున్నాయి. కోరికలు మళ్ళీ కితకితలు పెడుతున్నాయి.

ఒకనాటి రాత్రి హఠాత్తుగా మెలుకువ వచ్చి అలవాటు ప్రకారం చేయి పిల్లవాడివైపు పోయే సరికి పక్క ఖాళీగా ఉంది. విజయ ఒళ్ళు ఝుల్లుమంది. గుండె బరువెక్కిపోయింది. కొంతసేపు ఏమీ తోచని స్థితిలో ఉండిపోయింది. భయంతో ఎలాగో లేచి గాభరాగా, ''ఏమండీ! ఏమండీ! పాప! పాప! కనపడలేదు!'' అని భర్తను లేపింది.

అతను లేచి, ''ఏమిటి? ఏమిటయింది?'' అని అడిగాడు.

''పాప అండీ! పాప పక్కలో లేడు'' అని ఏడుస్తూ అంది.

''అంతే కదా? పరవాలేదులే, మా వదినగారి దగ్గరో, అమ్మ దగ్గరో ఉంటాడులే'' అనేశాడు.

ఆ మాటలూ, అతని ధీమా చూసి విజయ నివ్వెరపోయింది. 'చంటి పాపడు ఏమయినాడో అని తన నోట మాటే రాకుండా ఉంది. బెంగతో తనకు గుండెలు కొట్టుకొంటుంటే, ఆయన చీమ కుట్టినట్లయినా లేకుండా, అంత ధైర్యంగా అలా అంటున్నా రేమిటి?'' అని అనుకుంది.

''అదేమిటండీ, అలా అంటారు? పాప ఏమయిపోయాడో అని నేను బెంగపడి చస్తుంటేను?'' అని అడిగింది.

''మరేం బెంగ అక్కర్లేదు. విజయా! నీ పాపని ఎవ్వరూ ఎత్తుకుపోలేదులే! మా వదినగారి దగ్గర ఉంటాడు.'' అని తిరిగి నొక్కి అన్నాడు.

ఆ మాటలకు ఆశ్చర్యపోయింది ఆమె. పాపను చూస్తేనే కాని ఆమె భయం పోదు.

''మీ వదినగారి దగ్గరా?'' అని విస్తుపోతూ అవైపు నడిచింది.

''ఆగు విజయా! ఇప్పుడేం మించిపోయింది? అక్కడే పడుకోనివ్వకూడదు?'' అన్నాడు.

''బాగుందండీ. మీరు మరీని. మీకు తెలియదు, ఊరుకోండి. పాపం ఎంత ఆకలి వేస్తోందో, ఏమో? పసికూనకి ఏం తెలుస్తుంది?'' అంటూ తోటికోడలు గదిలోకి నడిచింది. ఆ ఆత్రుతలో ఆమెకు సమయం, సందర్భం, ఏమీ లెక్కలోకి రాలేదు. ఆమె హృదయం పాపాయిని చూడాలని తొందరపడుతూంది. అప్పటికి కానీ భయం పోదు.

''అయినా తన పక్కలో పాపను తనకు తెలియకుండా తీసుకుపోవడం ఏమిటి? ఆశ్చర్యంగా వుందే? బహుశా పిల్లలు లేకపోవడం చేత ముద్దు కొద్దీ అలా చేసి ఉంటుంది'' అనుకుంది. పాపం. పిల్లలు లేనివాళ్ళబాధ అలా ఉంటుంది కదా! అని విచారించింది.

మెల్లిగా గది తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళింది. తోటికోడలు పక్కలో పాప హాయిగా పడుకుని నిద్ర పోతున్నాడు. తోటి కోడలు మరో పక్కకు తిరిగి పడుకుని ఉంది. అది చూసి, 'చంటిపిల్ల తల్లి అయితే అలా అటు తిరిగి, పిల్లాడివైపు నడ్డి పెట్టి పడుకుంటుందా?' అని నవ్వుకుంది. 'పాపం, పిల్లలు లేరు. ఏం తెలుస్తుంది?' అని జాలిపడింది. మెల్లిగా వెళ్ళి పిల్లాడిని తీసుకుంది. పాలు చేపుకివచ్చి గుండెలకు అదుముకుంది. పక్కలో పాలసీసా చూసి గతుక్కుమని, ముక్కుమీద వేలేసుకుంది. తనతోటికోడలు ఎందుకలా చేసిందో అర్థంకాక ఆశ్చర్యపోయింది.

ఆ సందడితో తోటికోడలుకు మెలుకువ వచ్చింది. విజయ పాపను తీసుకుపోతున్నా లేవలేదు. ఒక్కమాట కూడా అనలేదు. ఏదో పొరపాటు చేసినదానిలా ఊరుకుంది.

విజయ తిరిగి తన గదిలోకి వచ్చేసింది. భర్త కూడా ఏమీ అనలేదు. ఆ మొభావం, వాళ్ళ ప్రవర్తన చూసి, అదంతా అందరూ తెలిసే చేస్తున్నట్లు, తనకు తెలియకుండా దాచినట్లు అనిపించింది.

పాపకు కడుపునిండా పాలిచ్చి పాపమీద చెయ్యి చుట్టబెట్టి హృదయంలో దాచుకుని పడుకుంది. రాత్రి ఆమెకు మరి నిద్ర పట్టలేదు.

ఆ మర్నాటి నుంచి ఇంట్లో పరిస్థితి మారిపోయింది. కలలో కూడా అనుకోని సంఘటనలను విజయ ఎదుర్కోవలసి వచ్చింది. మాటలమీద మాటలురాగా, ఆ మర్నాడు అత్తగారు, ''విజయా! పాపం, సరోజ ముచ్చట పడుతూంది. దానికి మరి ఆ ఆశలేదు కదా? చంటివాడిని సరోజకు పెంపకం ఇస్తే బాగుంటుంది. ఏమంటావు?'' అంది.

తోటికోడలు కూడా ''ఏం చెల్లీ! నీకు తెలుసుగా, నేనెంత బాధపడుతున్నానో? పైవాళ్ళయితే ప్రేమా, పేగా? ఇప్పటినుండే నా దగ్గర చనువు అయ్యాడంటే మా పిల్లవాడిలాగే పెరుగుతాడు. మా సరదా, కోరికా కూడా తీరుతాయి. వాడు నీవాడయితే ఒకటి, మావాడయితే ఒకటీనా? ఇంట్లోనే ఉంటాడుగా? ఎడంగా ఉంచితే అంతేచాలు. ఏమంటావు? నీవు కన్ననాటినుండి మేమెంతో ఆశపడ్డాము. కాదనకు'' అంది.

బావగారు జాలిగా ముఖం పెట్టారు.

మామగారు మాట్లాడలేదు.

భర్త ఎవరికీ జవాబు చెప్పలేని స్థితిలో ఉన్నాడు.

విజయ స్థితి ఊహించలేని మెట్టుకు దిగజారింది. కడుపు పండి, పిల్లవాడిని చూసుకొని మురిసిపోతుంటే ఇదేమిటి, పిడుగులాటి ఈ వార్త ? ఇలా లోకంలో ఎక్కడయినా జరుగుతుందా ? వీళ్ళందరూ ఎలా అడగగలుగుతున్నారు ! హాస్యమా, నిజమా ? అత్తగారు మాత్రం ఆడది కాదా ? తల్లి కాలేదా ? కడుపుతీపి గ్రహించలేదా ?

పోనీ ఒకరో, ఇద్దరో పిల్లలు పుట్టాక ఈ మాట అంటే బాగానే వుండేది. ఇంకా తొలిసంతానమె! తన ముద్దు, ప్రేమ ఎలా తీరేది ? గుండె రాయి చేసుకోగలదా ? లేక...

లేక చేసేదేముంది ? ఇంట్లో అందరూ ఏకమయిపోయారే ! ఎదిరించి ఎక్కడ బ్రతకడం ? ఎవరున్నారని, వెనకేసుకురావడానికి ?

అందుకని, ప్రేమను, అభిమానాన్ని చంపుకుని, కన్నకొడుకును, ఈ నెలల పిల్లాడిని, మనో ధర్మానికి వ్యతిరేకంగా త్యాగం చేయడమా ? ఇదెక్కడి న్యాయం ? లేదు. అలా జరగడానికి వీల్లేదు. తన ప్రేమను హృదయంలో నుంచి తీసిపారేయలేదు. అభిమానాన్ని చంపుకుని మనసు రాయి చేసుకోలేదు.

అదీకాక ఎదురుగుండా ఒక జాలిలేని ఒడిలో బలవంతంగా తెచ్చుకున్న ప్రేమలో, అస్వాభావికమయిన వాతావరణంలో - మాతృ ప్రేమ, వాత్సల్యం లేకుండా, అనాథలా పెరుగుతుంటే తల్లి అయి వుండి చూస్తు ఎలా ఊరుకోగలదు ? ఏ తల్లి హృదయం సహించి ఉండగలదు ? ఇది జరగకూడదు ! తను పాపకు దూరంగా ఉండలేదు. తనను పాపనుండి ఎవరూ వేరు చేయలేరు.

ఈ విధంగా ఆలోచించుకుంది విజయ. ఆమెలో ఏదో శక్తి ప్రవేశించింది. ఆ విషయంలో ప్రపంచాన్నయినా, ఆఖరికి దేవుడినయినా సరే ఎదుర్కొనే ధైర్యం ప్రవేశించింది.

''ఈ పాపని - నా దగ్గరే ఉండనివ్వండి. ఈసారి మీ కోరిక కాదనను'' అని మెల్లిగా సిగ్గుతో అంది, కళ్ళు ఒత్తుకుంటూ.

ఆ మాటలు విని అందరూ మూతులు ముడుచుకున్నారు. ఎవరూ ఏమాటా అనలేదు. బావగారు చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయారు. తోటికోడలు దులపరించుకుంటూ పోయింది. అత్తగారు మింగేస్తానంటూ గుడ్లెర్రచేసి ఊరుకుంది. మామగారు నిర్లక్ష్యంగా చూసి ఊరుకున్నారు. భర్త ఒక్క నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయేడు.

విజయ గుండె నిబ్బరం చేసుకుంది. పాపను గుండెల కదుముకొని ''నువ్వు, నేనూ ఒకటి. ఎవరేం చేయగలరు ? ఎవరేం అనుకుంటే మనకేమిటి ?'' అని, పాప పాలు తాగుతూంటే ఆ పరవశంలో ఉండిపోయింది.

అలా అనేశారు కానీ, తన ఇష్టం లేకుండా పిల్లాడిని తీసుకుంటారా అనుకుంది. ఒకవేళ వాళ్ళు అలా చేయబూసినా, తన భర్త ఊరుకుంటాడా ? తనకు ఆ మాత్రం స్వతంత్రం హక్కూ లేదా ? అనుకుంది. - కానీ ఆ ఇంట్లో అంతా విచిత్రంగా జరిగింది.

ఎవ్వరూ నమ్మడానికి వీల్లేకుండా - భర్తతో సహా అందరూ ప్రకృతి ధర్మానికే విరుద్ధంగా ప్రవర్తించజొచ్చేరు. అందరూ ఒకటయిపోయారు. ఆమె ఒక్కతీ ఒక్కటి.

ఎప్పుడు ఆమె వాళ్ళ అభిప్రాయాలతో ఏకీభవించకుండా ధైర్యంగా ఎదిరించిందో, ఆ క్షణం నుంచీ వాళ్ళ మనసుల్లో అసూయ, క్రౌర్యం, కోపం ప్రవేశించాయి. ఆమెను ఎలాగయినా సరే లొంగదీసి, ఆ పాపను పెద్దకోడలి పెంపకంలో ఉంచాలని ఇంటిల్లిపాదీ నిశ్చయించుకున్నారు.

సౌమ్యంగా చెప్పి చూశారు. విజయ తిరగబడేసరికి - బేధోపాయాలూ, దండోపాయాలూ కూడా మొదలుపెట్టారు.

బలవంతంగా ఆమె చేతిలో పిల్లవాడిని లాక్కుని సరోజ తీసుకుపోయేది. విజయను పాలు కూడా ఇవ్వనిచ్చేది కాదు. నిజంగా ఆ ఇంట్లో అందరూ నరరూప రాక్షసులయిపోయారు. దయ్యాలో, భూతాలో, పిశాచాలో అయిపోయారు. లేకపోతే ఏమిటా దౌర్జన్యం? మానవత్వం అంటూ ఉంటే అలా చెయ్యగలరా? తల్లినీ, బిడ్డనూ వేరు చేస్తారా ? .

కొంతవరకూ విజయ సహించి ఊరుకొనేది. మరి ఒకప్పుడు ఊరుకోలేక మొండిపట్టు పట్టి పిల్లవాడికోసం ఏడిస్తే, మగవాళ్ళు లేనప్పుడు అత్తగారూ, తోటికోడలూ కలిసి కొట్టడం కూడా ప్రారంభించారు.

రాను రాను పిల్లవాడిని విజయ దగ్గర రోజుకు ఒక పావుగంట ఉంచడమే కరువయిపోయింది. ఏదో అపురూపమయిన వస్తువును, పిల్లలు ఏడిస్తే ఒక్కసారి ఇచ్చి వెంటనే లాక్కుని దాచేసినట్లు చేయడం మొదలు పెట్టారు. విజయ గోడుమని గోల పెట్టినా, మొత్తుకున్నా ఎవరూ వినేవారు కాదు.

ఆఖరికి ఆ పావు గంటకూడా ఉంచకపోవడం అటుంచి, కంటికి కూడా కనిపించకుండా చేసేవారు. కళ్ళు కాయలు కాచేటట్లు పిల్లవాడికోసం చూసి చూసి, ఆశ నిరాశ కాగా కళ్ళు వాచేటట్లు ఏడిచేది. దొంగతనంగా ఎలాగో వాడిని మెరుపులా చూసి, కళ్ళారా చూసి ఆ ఆనందంలో సొమ్మసిల్లిపోయేది.

చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు ఎన్నోసార్లు భర్తతో చెప్పుకొని నెత్తీ, నోరూ బాదుకుంది. కాని ఆయన ఎందుచేతో రాయిలా మారిపోయాడు, మిదుమిక్కిలి.

''వాడిమీద ఎందుకు అంతలా పడి చస్తావు, వాళ్ళంతలా ప్రాధేయపడుతుంటే ? వాళ్ళ దగ్గరే పెరగ నివ్వకూడదా ? మనకేం మళ్ళీ సంతానం కలగకపోతుందా ? సరదాగా, నిశ్చింతగా, హాయిగా ఉండకూడదా, నన్ను వేధించక ?'' అని ఏ తండ్రి అననట్లు అనేశాడు.

ఆ మాటలు వినేసరికి విజయకు ఆశ్చర్యం, కోపం, అసహ్యం కూడా వేశాయి. 'ఎంత మగవాడయినా తండ్రి హృదయం లేదా ? ఇదేమి మనుష్యులు. వీళ్ళు ? అని చీదరించుకుంది.

కాని మరింక ఆమెకు దారేది? సహాయం చేసేది ఎవరు ? ఆమె దైవమే ఆమెకు విరోధి అయినప్పుడు ఇంక ఎవరితో చెప్పుకుని ఏడుస్తుంది ? ఈ విధంగా ఆశలన్నీ కూలిపోయి, అగ్ని పర్వతంలా లోలోనే బాధను అణుచుకుంటూ ఏడ్చి ఏడ్చి, జీవచ్ఛవంలా తయారయింది. ఆమెకు మరే సరదాలూ అక్కర్లేక పోయాయి. అహర్నిశలూ పిల్లవాడికోసమే బెంగ.

ఉన్నట్టుండి ఒకనాడు విజయ తోటికోడలు పిల్లవాడిని తీసుకువచ్చి ఎంతో ఆప్యాయంతో ఒడిలో పెట్టింది. స్వయంగా భోజనం పెట్టింది. ఆ రోజల్లా ఎంతో అభిమానం చూపెట్టింది.

సర్వసంగ పరిత్యాగిలా మారిపోయిన విజయ వాటికేమీ ఆశ్చర్యపోకపోయినా పిల్లవాడిని ఇచ్చేసరికి వాడితోనే లోకంగా ఉండిపోయింది.

సరి. ఆ మరునాటినుండి విజయ తనలో తాను నవ్వుకోడం, పిచ్చి, పిచ్చి మాటలాడుతుండడం ప్రారంభించింది. పాప ఏడుపు వినపడేసరికి ఆమెకు నరనరాలూ తోడుకుపోయేవి. ఆవేదనతో, ఉద్రేకంతో పిల్లవాడు ఎక్కడ ఉన్నా దొరబడి, బలవంతంగా లాక్కువచ్చి ఏ మూలకో పోయి పాలిస్తుండేది. ఆమెలో అంతవరకూ అణగిపోయి ఉన్న వాంఛ తిరగబడింది. విజయను అదుపులో పెట్టడం వారికి ఒక సమస్య అయి కూర్చుంది. అందుచేత అత్తగారూ, తోటికోడలూ కలిసి కొట్టడం, తిండి పెట్టకుండా పస్తులు పెట్టడం మొదలు పెట్టారు. అదీ శిక్ష. పెనుగులాడి పెనుగులాడి, అలిసి సొలసి మూర్ఛపోయేది విజయ.

రాను రానూ తను ఏమిటి చేస్తున్నదీ కూడా విజయకు తెలియని స్థితిలోకి దిగింది. ఒకనాటి రాత్రి అందరూ నిద్రలో ఉండగా విజయ మెల్లిగా లేచింది. పిల్లిలా వెళ్ళి, సరోజ పక్కలో ఉన్న తన కొడుకును తీసుకొని వీధిలోకి నడిచింది.

ఎందుచేతో వీధి తలుపూ తీసి ఉండడంవల్ల, ఆమెకు ఏ అడ్డూ లేకపోయింది. కానీ, ఇంకా వీధిగేటు దాటిందో, లేదో మామగారు వస్తూ ఈమెను చూశాడు. అప్పటికి మరేమీ అనకుండా ఇంట్లోకి తీసుకువచ్చేసాడు. అందరికీ ఆ విషయం తెలిసి కారాలూ, మిరియాలూ నూరారు. దానికి తగిన శాస్తి ఏమిటో ఆలోచించారు.

విజయకు పిచ్చెక్కిందని ప్రచారం చేశారు. ఇంక ఉపేక్షిస్తే లాభం లేదని, కేవలం ఆ పిల్లవాడి బాగుకోసమే అని చెప్పి, ఆ మర్నాడు గుప్‌చుప్‌గా పెద్ద కోడలు సరోజను పిల్లవాడితో సహా పుట్టింటికి పంపించివేశారు!

విజయ ఇదంతా నిర్జీవంగా చూస్తూ ఏం చేయలేక, కొరడుబారినట్లు అయిపోయింది. నిస్సహాయంగా బోనులో పెట్టిన సివంగిలా కోపాన్ని అణుచుకుంటూ, తనలోనే కుమిలి కుళ్ళిపోతూ వెక్కి వెక్కి ఏడుస్తూ ఉండిపోయింది. మనసులో క్షోభించి ఎన్ని శాపాలు పెట్టిందో !

ఇలా చేస్తూ తనకు పిచ్చి అనడం మరీ బాగుంది - అనుకుంది. తల్లీ పిల్లలను వేరు చేసి, ఎదురుగుండా ఉన్నా, చేరదీసి ఎత్తుకుని ముద్దాడడానికిగాని, కడుపారా పాలివ్వడానికిగాని, తనివితీరా లాలించి ఆడించడానికి గాని స్వంత కొడుకుమీద ఏ హక్కూ లేకుండా చేసి, తిరిగి తను మనిషిలా లేదని అనడం చూసి నవ్వుకుంది. ఏ తల్లి ఇటువంటి పరిస్థితిలో మామూలు మనిషిలా ఉండగలదు?

అంతవరకూ రోజుకు ఏ ఒక్కసారో దొంగతనంగానయినా చూసి తృప్తిపడేది. దూరంగా వాడు ఏడిస్తే ఆ గొంతు విని తృప్తి పడి ఊరుకొనేది. ఎప్పుడయినా దొంగతనంగా, ఎవరూ చూడకుండానయినా పిల్లాడిని తీసుకుని హృదయానికి హత్తుకొని గుండెల బరువు తీర్చుకొనేది.

ఇప్పుడా ఆశ కూడా లేకుండా, తన కొడుకు గాలి కూడా తగలకపోయేసరికి, వాడినీడ అయినా కనపడకపోయేసరికి విజయకు అంతా శూన్యమయిపోయింది. ఇంక ఆ ఇంట్లో ఒక్క క్షణమయినా ఉండ బుద్ధికాలేదు.

చూసి, చూసి, ఒకనాడు ఎవరూ చూడకుండా ఇంట్లో నుంచి వెళ్ళిపోయింది. ''పీడా వదిలింది'' అని అందరూ అనుకున్నా - లోకం కోసం, పరువుకోసం, వెతకక తప్పింది కాదు. తలొకరూ తలొకవైపూ బయలుదేరారు, ఆ ఊర్లో.

ఒక దగ్గర ఎంతో మంది జనం మూగి ఉన్నారు. ఆ గుంపు మధ్య ఒక స్త్రీ పడిపోయి ఉంది. విజయ భర్త వెతుకుతూ వెతుకుతూ, అక్కడకు వచ్చి చూశాడు. ఆ పడిపోయిన వ్యక్తి తన భార్యే అని తెలుసుకుని ఆమెను లేవనెత్తి, కూర్చోబెట్టాడు. సంగతేమిటని కనుక్కోగా అక్కడ ఒక ఇంట్లో ఉయ్యాలలో పాప నిద్రపోతూ ఉంటే ఈమె హఠాత్తుగా వెళ్లి పిల్లవాడిని తీసుకుని పారిపోతూ ఉంటే చూసి పట్టుకున్నారని, ఎంతకూ ఇవ్వనని అంటూంటే ఒకటి రెండు దెబ్బలు కొట్టి తీసుకోవలసి వచ్చిందని అక్కడ వాళ్ళు చెప్పారు. ''పాపం ఎవరో పిచ్చిది!'' అని అందరూ గొణుక్కున్నారు.

రిక్షా పిలిపించి విజయను ఎక్కించి మరేమీ మాట్లాడకుండా ఇంటికి వచ్చేశాడు భర్త. ఇంతవరకూ వస్తుందని వాళ్ళు అనుకోలేదు. ఇక, ఇప్పుడు ఏం చేయడానికి తోచలేదు. డాక్టరును పిలిచారు. ఆయన ఉన్న విషయం చెప్పాడు - ''మనోవ్యాధివల్ల మతి చలించింద'' నీ, ''చేయి మించిపోయిం''దనీ కూడా.

మళ్ళీ ఏ అఘాయిత్యం చేస్తుందోనని పగలల్లా ఎలాగోలా కనిపెట్టుకుంటూ రాత్రి అయ్యేసరికి కాళ్ళు, చేతులూ కట్టేసి ఒకచోట పడేసేవారు! ఆ పూట కాపూట ఇంత తిండి-చావకుండా, బ్రతకకుండా-పడేస్తున్నారు. విజయ పూర్తిగా మతి పోగొట్టుకుంది. ఆమెకు ప్రపంచ జ్ఞానం ఏమీ మిగలలేదు. ''బాబు! బాబు!'' అని అప్పుడప్పుడు ఏడుస్తూ వెర్రి చూపులు చూస్తుండడంతప్ప మరేమిలేదు.

అలా ఇంట్లో ఉండడం కూడా వాళ్ళకు కష్టమనిపించిందో, లేక ఎవరన్నా సలహా ఇచ్చారో ఏమో కాని, విజయను పదిలంగా పట్టుకు వెళ్ళి ఒకనాడు పిచ్చాసుపత్రిలో చేర్చారు. బావగారు, మామగారు, అక్కడ డాక్టరు చేత ఒక సర్టిఫికెట్టు కూడా తీసుకొన్నారు.

తర్వాత సరోజను, విజయ కొడుకును ఇంటికి తీసుకువచ్చేశారు! విజయ కొడుకుకు విజయకుమార్ అనే పేరు పెట్టారు. వాడికి ఏ లోటు చేయలేదు. సరోజ సొంత బిడ్డలాగే పెరుగుతున్నాడు.

విజయ భర్తలో హృదయం, మానవత్వం, జాలి, ప్రేమ లేవేమో- ఇవేమి తనకు పట్టనట్లే ఉన్నాడు. అలా కొన్నాళ్ళు జరిగిపోయింది. ఒకశుభముహూర్తంలో మరో వివాహం కూడా చేసుకొని, హాయిగా కాలం గడుపుతున్నాడు.

అక్కడ ఉంటే ఎలాగైనా విజయకుమార్‌కు అసలు విషయం తెలిసిపోతుందని సరోజ, ఆమె భర్త అక్కడ నుండి దూరంగా, చాలా దూరంగా, వాడిని తీసుకుపోయి ఉన్నారు. విజయకుమార్ ఎంతో తెలివితేటలు కలవాడయ్యాడు. చదువులో చాలా శ్రద్ధ, పట్టుదల చూపెట్టి మెడిసిన్ కూడా పాసయినాడు. ఇన్ని తెలిసినా, వాతావరణ ప్రభావంవల్ల తన తల్లి గుట్టు మాత్రం తెలియలేదు. సరోజ, ఆమె భర్త జాగ్రత్తగా, తెలియడానికి అవకాశం కలగకుండా చూస్తూ వచ్చారు. వాళ్ళే తల్లి తండ్రీ

అనుకునేవాడు విజయకుమార్.

విజయ భర్త రెండవ భార్యతో కాపురం చేస్తున్నా, మరి సంతానం కలగలేదు, కేవలం విజయ ఉసురే తగిలినట్లు దైవోపహతుడయిపోయాడు! ఆ విచారం విజయ భర్తకూ, ఆ ఇంట్లో అందరికీ కూడా గొడ్డలిపెట్టులా తగిలింది. అప్పుడు అందరికీ భగవంతుడు జ్ఞాపకం వచ్చాడు. వెంటనే, తాము విజయకు చేసిన అన్యాయం, దౌర్జన్యం, అమానుషత్వం- అన్నీ వాళ్ళను పీడింప జొచ్చాయి.

విజయ బావగారు అప్పుడపుడు వచ్చి తమ్ముడితో, ''ఎలాగో ఇన్నాళ్ళు జరిగిపోయింది. వాడికి ఇప్పటివరకూ ఏ సంగతులూ తెలియవు. ఇప్పుడు ఒక్కసారి తెలిసిందంటే ఇంట్లో సుఖ శాంతులుండవు. ఏ దానికేంవస్తుందో? అందుచేత అలాగే రహస్యంగా ఉంచు. ఇలా అవుతుందని అనుకున్నామా? మళ్ళీ నీకు సంతానం కలుగుతుందని భావించాము. కానీ, ఇలా చేస్తాడు భగవంతుడు! జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు అన్నీ కడుపులోనే ఉంచుకో. ఇన్నాళ్ళు మా కన్న కొడుకులా పెరిగాడు'' అని ప్రాధేయపడ్డాడు. మళ్ళీ కొడుకును ఎక్కడ తీసుకొంటాడో అన్న భయం కొద్దీ.

విజయ భర్త ఏమీ అనకుండా అందులోని స్వార్థం గ్రహించి ఒక అర్థం లేని నవ్వు నవ్వుతూ ఊరుకొన్నాడు కానీ రాను రానూ అతనిలో ఏదో పరివర్తన మొదలైంది. ఏమూలో అణగారి ఉన్న పుత్ర ప్రేమ వేధించనారంభించింది. దాని ప్రభావానికి తట్టుకోలేకపోతున్నాడు. మాటిమాటికి తన కొడుకు వైపు మనసు పరుగెత్తేది. అన్నీ ఉన్నా ఇంట్లో ఏదో లోటు, జీవితంలో ఏదో వెలితి కనిపించ సాగాయి. కానీ, ఎన్ని విధాలుగానో ఆలోచించి ఆలోచించి, తన కుటుంబ పరిస్థితి ఎలాంటి పరిణామం చెందుతుందో అన్న భయంతో ఓర్చి ఊరుకొనేవాడు.

అతనిలో ఈ మార్పు చాలా కాలం నుంచి వచ్చినా ఎవ్వరికీ తెలియనివ్వలేదు. అప్పటినుండి ఎవ్వరికీ తెలియకుండా, పిచ్చాసుపత్రికి అప్పుడప్పుడు వెళ్ళి విజయను దూరం నుంచే చూస్తూ కంటినీరు కార్చేవాడు. ఆమె అలా ఒక మూల యోగినిలా కూర్చుని ఏ లోకంలోనో ఉండడం గమనించి, ఇక చూడలేక ఏడ్చేవాడు. ఆమెను తిరిగి ఇంటికి తీసుకురావడానికి మాత్రం సాహసించలేకపోయాడు.

విజయకుమార్ కొన్నాళ్ళపాటు చిన్నాన్నగారింటికి వెళ్ళివస్తానని చెప్పి అక్కడికి రావడం తటస్థించింది. వద్దంటే ఏం అనుమానపడతాడో అని సరోజ, అమె భర్త ఏమీ అనలేక ఊరుకున్నారు.

ఎదురుగుండా విజయకుమార్‌ను చూస్తూ, తన కొడుకని పిలవలేని రోజు వచ్చింది. విజయ భర్తకు హృదయం పరిపరి విధాల పోయింది. కన్న కొడుకును చూస్తున్నకొద్దీ ఏదో కోల్పోయిన ఆత్మీయత లభించినట్లయింది. తన కొడుకుతో ఒక చిన్నాన్న మాట్లాడినట్లు మాట్లాడలేకపోతున్నాడు. ఏదో ఆవేశం, ఉద్రేకం కలుగుతున్నాయి. చెప్పలేని ఆవేదన పడుతున్నాడు. ఆఖరికి లోలో పొంగి పొరలి వస్తున్న పుత్ర ప్రేమను తండ్రిగా భరించలేకపోయాడు. ఒక్క క్షణంలో గుట్టు అంతా వెళ్ళగ్రక్కేసాడు.

అంతా చెప్పి-

''నాయనా, నేనొక పాపిని! నన్ను ఆ భగవంతుడు కూడా క్షమించడు. నీ అమ్మకు చేసిన

ద్రోహానికి అన్యాయానికి నిష్కృతిలేదు. ఈనాడు నీకు తండ్రినని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నా నా గుండెల్లో మంటలును చల్లార్చుకోలేక చెప్పేశాను. నేనెలాగూ మీ అమ్మను సుఖపెట్టలేకపోయాను నీకర్తవ్యం - చదువు కున్నవాడివి - నేను చెప్పనక్కర్లేదు. నాపరిస్థితి నీకు తెలుసు. నాకేం పాలు పోలేదు' అని ముఖం చాటుచేసుకొని ఏడవడం మొదలు పెట్టాడు. అంతా వింటూ విజయకుమార్ నిలువున నీరయిపోయాడు. అప్పులలో కూడా తీపి మాటలాడుతూ కనిపించేవారిలో ఎలాంటి ఘోరాలూ, రహస్యాలు దాగి ఉంటాయో తెలుసుకోలేకపోయాడు కదా?

ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేకపోయాడు. అతని ప్రాణం తల్లికోసం విలవిల లాడిపోయింది. హృదయం కన్నతల్లి కోసం తల్లడిల్లి పోయింది. మనసు అమ్మని చూడాలని తొందరపడుతూంది. అతనిలో మరే ఆలోచనకూ తావు లేదు. సర్వ శక్తులూ వెళ్ళి తల్లిని కలుసుకోమని ప్రోత్సహించాయి. ఉన్నపాళంగా లేచాడు.

''వెళతాను, నాన్నగారూ!'' అన్నాడు.

ఆ సంభోధన విని, అతడు కరిగిపోయాడు; చలించిపోయాడు. గద్గద స్వరంతో, ''ఎక్కడికి, తండ్రీ!'' అన్నాడు.

కళ్ళవెంట నీరు పెడుతూ '' అమ్మ దగ్గరికి. నన్ను కన్న తల్లి దగ్గరికి'' అని అంటూ వెళ్ళి పోయాడు విజయకుమార్.

★ ★ ★ ★

మరి చెప్పలేకపోయింది నర్సు. ఏడుపు దిగ మింగుతూ కళ్ళు తుడుచుకుంది. వింటున్న వాళ్ళు అలాగే నిశ్చేష్టులయిపోయారు. ఆసుపత్రిలో పురిటాళ్లు తమ పసికందులను కూడా మరిచి పోయి వింటున్నారు. ఒక పిల్ల ఏడిచింది. ఈ కథ వినే ఆసక్తితో ఆతల్లి పాపను ఒడిలోకి తీసుకొని పాలిస్తూ జో కొడుతూ, మళ్ళీ ఇటే వింటూంది.

'' ఆ విజయే ఈ విజయమ్మగారు. ఆ విజయకుమారే ఈనాటి డాక్టర్ విజయకుమార్. తల్లిని పిచ్చాసుపత్రి నుండి తీసుకువచ్చి తిరిగి తన దగ్గర అట్టి పెట్టుకున్నారు. కానీ, ఎంత ప్రయత్నించినా ఆమెను బాగు చేసుకోలేకపోయారు. మిగతా విషయాలలో ఆమె మామూలు మనిషేకానీ, చంటి పిల్లలను చూస్తే మటుగు ఒళ్ళు తెలియదు. ఎత్తి ముద్దులాడి, లాలించి, ఏడుస్తుంది!

'' ఇలాగే వచ్చిన కొత్తలో ఒకటి రెండు సార్లు పిల్లలను తీసుకు వెళ్ళిపోయింది. తనివితీరా ముద్దులాడి ఇంటికి తీసుకుపోయి ఉయ్యాలలో పడుకోబెట్టి నిద్ర పుచ్చుతుంది. అంతే. మరేమిచెయ్యదు. ఇదీ వారిద్దరి కథ''--- అని చెప్పింది నర్సు. ఆమె జాలి గాధ విని కంట తడి పెట్టుకోలేని తల్లులే లేరు.

★ ★ ★

( - ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, *24-3-1965.*)